ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ సింధూశర్మ వెల్లడి

కామారెడ్డి రూరల్, జనవరి 11 : సంక్రాంతి సెలవులకు ఊరికి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సింధూశర్మ సూచించారు. ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. ఊరికి వెళ్లే సమయంలో వీలైనంత మేరకు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలు ఉంచొద్దన్నారు. వాటిని లాకర్లు, భద్రంగా ఉండేచోట దాచుకోవాలని సూచించారు. బీరువా తాళాలు బీరువాపైన, బట్టల కింద, ఇంట్లో పెట్టి వెళ్లొద్దని, వాహనాలు ఇంటి ఎదుటే పార్క్ చేసి తాళాలు వెంట తీసుకెళ్లాలని చెప్పారు. నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనబడకుండా కర్టన్ వేయాలి, ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని, బయట ఉన్న గేటుకు లోపటి నుంచి తాళం వేయండి. బయటికి వెళ్లే ముందు ఇంట్లో, బయటి లైట్ వేసి ఉంచండని సూచించారు. నమ్మకమైన వాచ్‌మన్‌ను మాత్రమే నియమించండని చెప్పారు. ఊరికి వెళ్లే ముందు నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉందన్నారు. బస్సులు, రైళ్లలో వెళ్లేటప్పుడు అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోవద్దని చెప్పారు. బయటికి వెళ్లే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయొద్దన్నారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే డయల్ 100, కామారెడ్డి పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686133 లేదా 8712686133కి వాట్సాప్ కాల్ చేయాలని సూచించారు.

దొంగతనాలు జరగకుండా జాగత్రలు తీసుకోవాలి

గాంధారి, జనవరి 11: ఇండ్లలో దొంగతనాలు జరగకుండా జాగత్రలు తీసుకోవాలని గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఊళ్లకు వెళ్లే వారికి పలు సూచనలు చేశారు. మహిళలు బయటికి వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలను జాగ్రతగా చూసుకోవాలని, వీలైతే చీర కొంగుతో కనబడకుండా కప్పుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన

భిక్కనూరు, జనవరి 11 : హైదరాబాద్‌లో నిర్వహించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ కార్నివాల్-2025లో భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన స్టాల్ ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ 78వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని సంఘ మిత్రా పాఠశాలలో కార్నివాల్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, సైన్స్ ఉపాధ్యాయులు తమ్మల రాజు, సరిత ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన నందిని, మహేశ్, కీర్తన, విశ్వక్, రాజు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శిల్ప వల్లి, బీఐఎస్ అధికారి శ్రీకాంత్, భిక్కనూరు విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలించి ప్రశంసించారు.

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భిక్కనూరు విద్యార్థులు

నిర్మించారు.. వదిలేశారు..

- నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

రాజంపేట మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లు

రాజంపేట్, జనవరి 11 : మండల కేంద్రంలోని మార్కెట్‌లో పబ్లిక్ టాయిలెట్స్, మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. రాజంపేటలో ప్రతి శుక్రవారం వార సంతతోపాటు నిత్యం కూరగాయల మార్కెట్ కొనసాగుతున్నది. మండల కేంద్రం ఏర్పడక ముందు నుంచి డైలీ మార్కెట్ సాగుతున్నది. నూతన మండలంగా ఏర్పడినప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మండల కార్యాలయాలు, బ్యాంకు పనినిమిత్తం వచ్చిపోయే వారితో రద్దీగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాలైన శివాయిపల్లి, బస్వన్నపల్లి రైతులు కూరగాయల పంటలు ఎక్కువగా పండించడంతో కామారెడ్డితోపాటు రాజంపేట మార్కెట్‌కు కూరగాయలు తీసుకువస్తుంటారు. మార్కెట్‌లో వసతులను కల్పించడం కోసం కొన్ని నెలల క్రితం పబ్లిక్ టాయిలెట్లు, తాగు నీటి కోసం బోరు వేయించి మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. వీటికి నీటి కనెక్షన్ ఇవ్వకపోవడంతో వృథాగా ఉన్నాయి. అధికారులు పట్టించుకో కపోవడంతో పబ్లిక్ టాయిలెట్లు, వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి నిర్మించిన వాటిని నిరుపయోగంగా ఉంచడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని, తాగునీటి వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు లేకుండా ఖాళీగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్

మరుగుదొడ్లు బాగు చేయించాలి

మార్కెట్‌లో మరుగుదొడ్లను బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలి. అన్ని వసతులు పట్టించుకునే వారే కరువయ్యారు. వాటిని ఉపయోగించకపోవడంతో పనికి రాకుండా పోయాయి. అధికారులు స్పందించి బాగు చేయించాలి.

- కొప్పుల బాలయ్య, కూరగాయల వ్యాపారి

హైదరాబాద్ తరలిన మైనార్టీ ఉద్యోగుల సంఘం సభ్యులు

బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మైనార్టీ ఉద్యోగులు

బాన్సువాడ, జనవరి 11 : హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమానికి మైనార్టీ ఉద్యోగుల సంఘం సభ్యులు శనివారం బాన్సువాడ నుంచి తరలివెళ్లారు. మైనార్టీ ఉద్యోగుల సమస్యలు, సంక్షేమమే లక్ష్యంగా చర్చించే కార్యక్రమానికి తరలినట్లు అధ్యక్షుడు సయ్యద్ వాహబ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హాజీ తెలిపారు. తరలివెళ్లినవారిలో కోశాధికారి సయ్యద్ అబ్దుల్ రజాక్, యూనియన్ సభ్యులు ఖలీల్, మహ్మద్ అక్బర్, ఆమెర్, బాబు, ఖాన్, మసూద్, ఆసీఫ్, సయ్యద్ ఇమ్రాన్, బిలాల్ తదితరులు ఉన్నారు.

రాంపూర్ తండాలో క్రీడాపోటీలు ప్రారంభం

రాంపూర్ తండాలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ హరిసింగ్

బాన్సువాడ రూరల్, జనవరి 11 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాన్సువాడ మండలం రాంపూర్ తండాలో క్రికెట్, వాలీబాల్ పోటీలను మాజీ వైస్ ఎంపీపీ హరిసింగ్ స్థానిక తండా పెద్దలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం తండాలో క్రీడా పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు గోప్యానాయక్, కారోబార్ ప్రకాశ్, మోహన్‌నాయక్, అంబర్ సింగ్, హర్జ్యానాయక్, సీతారాం, ఫకీరానాయక్, దేవి, రమేశ్, గంగారాం, తారాచంద్, రాజేశ్, సుధాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ రక్త దాతలకు అవార్డుల అందజేత

కామారెడ్డి రూరల్, జనవరి 11 : కామారెడ్డి రక్తదాతల సమూహాన్ని ఏర్పాటు చేసి 17 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఉత్తమ రక్త దాతలు, మోటివేటర్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా రక్తదాతల సమూహ ఫౌండర్ డాక్టర్ బాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షుడు జమీల్, డాక్టర్ పుట్ట అనిల్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ రెయిలింగ్ నిర్మాణం

మాచారెడ్డి, జనవరి 11 : మండలంలోని అక్కాపూర్‌లో మాడశేశ్వరస్వామి ఆలయానికి చుట్టూ రెయిలింగ్‌ను గ్రామానికి చెందిన సంగోళ్ల దివ్య-శేఖర్ దంపతులు నిర్మించారు. రూ.60 వేలు ఖర్చుచేసి రెయిలింగ్ పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు. ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రామ పెద్దలు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్, జనవరి 11 : కామారెడ్డి పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం, రాష్ట్ర, జిల్లా బాధ్యులు ప్రభాకర్, గిరి, సురేందర్, వెంకట్, ఎల్లాగౌడ్, కృష్ణ, సునీల్, బాల్ చంద్రం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏఎస్పీ చైతన్యారెడ్డి

భిక్కనూరులో జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

భిక్కనూరు, జనవరి 11 : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా భిక్కనూరు మండల కేంద్రంలో వాహనదారులకు ఏఎస్పీ శనివారం అవగాహన కల్పించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దన్నారు. మద్యం తాగి వాహనలు నడపొద్దని సూచించారు. అనంతరం మండలంలోని కంచర్లలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. భిక్కనూరు పరిధిలోని బ్లూకోర్టు, పెట్రోల్ కార్ సిబ్బందికి కొత్త బ్లూకోర్టు జాకెట్లు, హెల్మెట్లు అందించారు. కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, సర్కిల్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ ఒకరి మృతి

సుధీర్(ఫైల్)

మద్నూర్, జనవరి 11 : మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానిక ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం మండలకేంద్రానికి చెందిన సుధీర్(55) బైక్‌పై రోడ్డుపై వెళుతుండగా పెద్దశక్కర్గ బైపాస్ వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో సుధీర్ తలకు తీవ్రగాయాలు కావడంతో నాందేడ్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి 11: ఎల్లారెడ్డి మండలంలోని రామలింగం బావి వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం. నిజాంసాగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన పిర్ని కాశీరాములు (38) తన ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డి వైపు వస్తుండగా ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో కాశీరాములు ఘటనా స్థలంలోనే మరణించాడు. కాగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదం సంభవించిందా? ప్రమాదవశాత్తు జరిగిందా? అనే కోణంలో విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

రామారెడ్డి, జనవరి 11: మండలంలోని బట్టుతండాలో శుక్రవారం చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు కాగా శనివారం మృతదేహం లభించింది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామావత్ రవీందర్(28) శుక్రవారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లి ప్రమాద వశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. మృతదేహం కోసం జాలర్లు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా శనివారం మధ్యాహ్నం లభించింది. రవీందర్‌కు ఇద్దరు భార్యలు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

బాల్కొండ, జనవరి 11: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీవాసులు శనివారం ఆందోళన చేపట్టారు. కాలనీలో డ్రైనేజీల్లో మురికి పేరుకుపోయిందని, చెత్తా చెదారం పెరిగిందని తెలిపారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి నీరు బయటికి వెళ్లడం లేదని, దీంతో దుర్వాసన వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

చెట్టును ఢీ కొట్టిన ఆటో : ముగ్గురికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సునీతను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట, జనవరి11: మండలంలోని ధర్మారెడ్డి గ్రామం నుంచి పని కోసం మాల్తుమ్మెద గ్రామానికి వెళ్తున్న కూలీల ఆటో మార్గమధ్యలో అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టగా ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన దినసరి కూలీలు మాల్తుమ్మెద గ్రామంలో వరి నాట్లు వేసేందుకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో మాల్తుమ్మెద గ్రామ శివారులో అదుపుతప్పిన ఆటో చెట్టును ఢీకొన్నది. క్షత్రగాత్రులను గోపాల్‌పేట జేఎస్ఎమ్ దవాఖానకు తరలించగా.. సునీత అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మరో ఇద్దరు మహిళలు భాగ్య, లావణ్యకు దవాఖానలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్ : ఒకరికి గాయాలు..

గాంధారి, జనవరి 11 : ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. 108 అంబులెన్సు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన పెద్ద బీరయ్య శనివారం సీతాయిపల్లి గ్రామం నుంచి గాంధారివైపునకు ఎక్సెల్‌పై వస్తుండగా, పొతంగల్ కలాన్ గేటు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. గాయపడిన బీరయ్యను 108 వాహనంలో బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. బీరయ్య వద్ద ఉన్ననగదును వారి బంధువులకు అప్పగించామని 108 ఈఆర్పీసీ శివ, ఈఎంటీ కమలాకర్, పైలట్ నరేశ్ తెలిపారు.

రైతులకు యూరియా పంపిణీ

లింగంపేట గోదాంలో నిల్వ ఉన్న యూరియా

లింగంపేట, జనవరి 11: లింగంపేట సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు సహకార సంఘ చైర్మన్ దేవేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. యాసంగిలో పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా అందుబాటులో ఉంచామన్నారు. పోతాయిపల్లిలో వంద బస్తాలు, శెట్పల్లిలో వంద, భవానీపేటలో 500, ఐలాపూర్‌లో 450, లింగంపేటలో 1500 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నదని, కావాల్సిన రైతులు పట్టదారు పాసుపుస్తకం తీసుకొచ్చి ఎరువులు పొందాలని సూచించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి

లింగంపేట, జనవరి 11 : మండలంలోని మోతె గ్రామ వాలీబాల్ క్రీడాకారులకు మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడాదుస్తులు అందించామని ఆయన పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించే వారిని మరింత ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాంరెడ్డికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలేటి సంతోష్‌రెడ్డి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో స్వామి నరేంద్రాచార్య మహరాజ్ ఉపపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, జనవరి 11: అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో స్వామి నరేంద్రాచార్య మహరాజ్ ఉపపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ నుంచి 19 వరకు ఉపపీఠం ఆధ్వర్యంలో లక్ష ప్యాకెట్ల రక్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, శుక్రవారం వరకు 48,500 ప్యాకెట్ల రక్తం సేకరించారన్నారు. రక్త దానం చేసేవారు ఒకరైతే రాష్ట్రాలు, గ్రామాలు తేడా లేకుండా అవసరమున్న వారికి రక్తం అందిస్తామన్నారు. రాష్ట్రంలోనే కాకుండా 14 రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాల్చర్ రాజు, మైపత్ హన్మాండ్లు, బస్వరాజ్ పటేల్, డాక్టర్ రాజు, ఉపపీఠం కామారెడ్డి జిల్లా నిరీక్ష సుశీల్ పాటిల్, జిల్లా అధ్యక్షుడు ఓగె హన్మంత్, మండల అధ్యక్షుడు చిల్లెల సాయిలు, ఏడ్గి బాలరాజ్, బంటు విఠల్, రక్త దాతలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన శెట్పల్లి గంగవ్వ, కొట్టె లింగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయనవెంట పార్టీ నాయకులు నాల్చర్ రాజు, బస్వరాజ్ పటేల్, యాదారావు, మల్లికార్జున్, డాక్టర్ రాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రాములు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నాగిరెడ్డిపేట, జనవరి 11: మాల్తుమ్మెద సింగిల్ విండో అధ్యక్షుడు దుందిగళ్ల నర్సింహులుకు రూ.60వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట, జనవరి11: మండల కేంద్రానికి చెందిన బాధితుడు చాకలి రాజుకు 60వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం అందించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు చెక్కును ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, గ్రామ అధ్యక్షుడు పోతగోని ప్రసాద్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, నాయకులు ఎల్లమయ్య, దశరథ్, కౌడ రవీందర్, సలీం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మండల స్థాయి క్రికెట్ పోటీల ప్రారంభం

నాగిరెడ్డిపేట, జనవరి 11: మండల కేంద్రం గోపాల్‌పేటలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మండల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మధ్య స్నేహభావం పెరగాలనే మంచి ఉద్దేశంతో టోర్నీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 12 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజర్ ఇమామ్ తెలిపారు. గెలుపొందిన టీమ్‌లకు నగదు బహుమతితో పాటు కప్‌లు, వ్యక్తిగత బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

బాధితుడికి ఫోన్‌ను అందిస్తున్న ఎస్సై సుధాకర్

లింగంపేట, జనవరి 11: మండల కేంద్రానికి చెందిన శంకర్ శర్మ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించినట్లు ఎస్సై సుధాకర్ శనివారం తెలిపారు. కొంతకాలం క్రితం శంకర్‌శర్మ తన ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేసినట్లు తెలిపారు.